"పేరు చాలా బాగుంది" అన్నాడు రావు.

"ఏ పేరు?" అతని జూనియర్ త్రివేది అడిగాడు.

ఇద్దరూ మయూరాక్షి ఎక్స్‌ప్రెస్‌లో హౌరా వెళ్తున్నారు. పాంట్రీ కారులో కూర్చున్నారు. బ్రెడ్, బటర్, కారన్ ఫ్లేక్స్, ఒక పాట్ కాఫీ ఎదురుగుండా పెట్టుకున్నారు.



# మయూరాక్షి

## ఘంటికోట బ్రహ్మాజీరావు

"మయూరాక్షి!"

ఆ మాట వినగానే టేబిలుకు రెండోవేపు వీళ్లకు ఎదురుగా కూర్చున్న యువతి ముఖమెత్తి చూసింది. ఆ మగాళ్లిద్దరి ముఖాల్లోకి చూసి అడిగింది. "నా పేరెవరు పిలిచారు?"

"క్షమించండి! నేను ప్రాజెక్ట్ గురించి అంటున్నాను. మీ గురించి కాదు" అన్నాడు రావు.

"ఏదయితేనేం ప్రాజెక్టూ చక్కగానే వుంది. మా ఎదుటనున్న మయూరాక్షి కూడా అంత అందంగానూ వుంది" అన్నాడు త్రివేది.

ఎదురుగా కూర్చున్న మయూరాక్షి నవ్వింది. ఆ నవ్వు సాయంకాలంపూట విచ్చుకుంటున్న మల్లెపూల చెండులా పరిమళించింది.

"మిమ్మల్ని ప్రాజెక్టు ఆఫీసులో చూసినట్టు జ్ఞాపకం" అన్నాడు మళ్లా త్రివేది.

"అవును- నేను పెర్సనల్ బ్రాంచిలో సీనియర్ క్లార్కుగా పని చేస్తున్నాను" అంది మయూరాక్షి.

"ప్రతివారం మీరు బర్ద్వాన్ వరకు వెళ్తారు కదూ?"

"అవును. ఆదివారం ఉదయం వెళ్లి మళ్లా సోమ వారం ఉదయానికి మరో బండిలో తిరిగొస్తాను"

"మనం బర్ద్వాన్ దాటిపోయామే!"

"ఈ సారి నేను కలకత్తా మా అక్క గారింటికి పోతున్నాను."

"ఏదయితేనేం మీ పేరు చాలా చక్కగా వుంది" అన్నాడు రావు.

"మిమ్మల్ని కూడా చూసినట్లే వుంది" మయూ రాక్షి రావుతో అంది.

"అవును. రెండు మూడుసార్లు మీ స్టోర్సు ఆఫీసర్ రాయ్ బాబుని కలియడానికి వచ్చాను. అప్పుడు మీ సెక్షన్ మీద నుంచే వెళ్లాను" అన్నాడు రావు.

రాయ్ బాబు పేరు వినగానే మయూరాక్షి గతుక్కు మంది.

"మీ పేరేమిటో నాకు తెలీదు. మీరు రాయ్ బాబుతో వ్యవహరించేటప్పుడు చాలా జాగ్రత్తగా వుండాలి."

"నా పేరు రావు. సారీ! నా గురించి చెప్పడమే మరచిపోయాను. హడ్సన్ అండ్ సేన్ ప్రాజెక్టు కంట్రాక్టర్సుతో నేను పని చేస్తున్నాను- హెవీ ఎర్త్ మూవింగ్ ఎక్విప్‌మెంట్ నా పర్యవేక్షణలోనే వుంది. నన్ను ఛీఫ్ మెకానిక్ అంటారు."

"అంటే మీరు ఇంజనీర్ కారా?" మయూరాక్షి అడిగింది.

"ఇది అమెరికన్ స్టయిల్. మనం చీఫ్ మెకానికల్ ఇంజనీరు అంటే వారు చీఫ్ మెకానిక్ అంటారు. ఇతను నా జూనియర్ - మిస్టర్ త్రివేది!"

మయూరాక్షి లేచి నిలబడింది.

"క్షమించండి రావు బాబూ! నేను వెళ్లిపోతా."

"ఏం వెళ్లిపోతున్నారు? తాగుతున్న టీ కూడా పూర్తి చేయలేదు" అన్నాడు త్రివేది.

"మీరు చాలా చాలా పెద్దవాళ్లు. ఆరువేలకు పైగా జీతాలు అందుకుంటున్నవారు. నేను మామూలు సీని యర్ క్లర్కుని..."

"మిస్ మయూరాక్షి!..." రావు ఏదో చెప్ప బోయాడు.

"ప్లీజ్ కరెక్ట్ యువర్‌సెల్ఫ్! అయామ్ మిసెస్ మయూరాక్షి."


"క్షమించండి- మిసెస్ మయూరాక్షి. మేం పెద్ద వాళ్లమని, మీరు చిన్న వాళ్లమని ఎప్పుడూ అనుకోకండి. ఇంతకీ మేము కంట్రాక్టరు స్టాఫ్‌మి. ఈ రోజుండి రేపు వెళ్లిపోవలసిన వాళ్లమి. మీరు గవర్నమెంటు ఉద్యోగులు- అధికారం, హోదా మొదలయినవి వున్నవాళ్లు- కాబట్టి మీరేం కించపడకండి" అన్నాడు రావు.

"మయూరాక్షి! మనం అందరం స్నేహితులం. మేక్ యువర్ సెల్ఫ్ కంఫర్టబల్" అన్నాడు త్రివేది.

మయూరాక్షి టీ చల్లారిపోయింది. మళ్లీ ఆమెకు టీ, టోస్టు ఆర్డరు చేసి కూర్చోబెట్టారు.

హౌరా స్టేషనుకు కంపెనీ కారొచ్చింది. మయూరాక్షి రానంటున్నా ఆమెను బలవంతంగా కార్లో ఎక్కించి బాలీగంజ్‌లో వాళ్లక్కయ్య గారింటి ముందు దింపి వాళ్లు వెళ్లిపోయారు.

రావు చాలా పెద్ద ఇంజనీరు. ప్రాజెక్టు సైటులో నాలుగు రోజులే వుంటాడు. ఆదివారం నాడు సెలవు- సోమ, మంగళవారాలు కంపెనీ డైరెక్టర్లతో మీటింగ్ జరిపి వెళ్ళిపోతాడు.




ప్రాజెక్టు కొంచెం దూరంలో అతను టెంటులో వుంటున్నాడు. పేరుకది టెంటు- కాని లోపల అన్ని సౌకర్యాలు వున్నాయి. పగలల్లా అతను సైట్‌లోనే వుంటాడు. తల మీద టోపీ, కళ్లకు గాగుల్సు, నోట్లో పైపు, చిన్న ఫ్రెంచి గడ్డం - ఇవన్నీ అతనిని సులువుగా బయట పెడతాయి.

ఇవాళ ఆదివారం. పార్కు టౌనులో ఫైవ్ స్టారు హోటలులో అతనికో డబల్ రూము రిజర్వయి వుంటుంది. లంచ్ అయి, అతను కొంచెం సేపు విశ్రమించిన తరువాత, సాయంకాలం నాలుగు నుండి ఆరు వరకు డిక్టేషనిస్తాడు. రోజీ, మేరీ, లేకపోతే లిల్లీ- వీళ్లలో ఎవరో ఒకరు వచ్చి పనిచేస్తారు. ఆ రాత్రికి అతనితో వుంటారు. అతను ఉద్యోగమే పరమావధిగా పెట్టుకొని పెళ్లి కూడా చేసుకోలేదు. అతని వయసు ముప్ఫయికి లోపే.

అతనికి త్రివేది వంటి అసిస్టెంటులు చాలమంది వుంటారు.

ఆ ఆదివారం రాత్రి అతను లిల్లీకి క్షమాపణ చెప్పి రెండు పులి బుర్ర నోట్లు ఆమె చేతిలో వుంచి పంపించాడు. డిన్నరయింతరువాత రెండు పెగ్గులు వేసుకుని సావకాశంగా పక్క మీద వదుం వాల్చాడు.

"మయూరాక్షి!" అనుకున్నాడు పైకి.

ఎంత అం దమయిందా పేరు! ఆ పేరుకు మోహపడి, జీతం వేయి రూపాయిలు తక్కువైనా, అరబ్ దేశాలలో చాలా పెద్ద జీతంతో పిలుపులు వచ్చినా వెళ్లడం మానేశాడు.

ఆ మయూరాక్షి ఇవాళ చక్కని బెంగాలీ అమ్మాయిగా సాక్షాత్కరించింది. కాని ఆమె మిసెస్ మయూరాక్షి!

అతనికేం విచారం లేదు. ఆ పేరుకు తగినంత చక్కనిదా అమ్మాయి. ఆమెను చూడడంలోనే ఒక ఆనందం కలుగుతోంది. అభిమానమున్న పిల్ల. బాగా చదువుకున్నట్లుంది. చక్కని ఇంగ్లీషు మాట్లాడుతోంది.

ఆ విశాలమైన కళ్లు, అమాయకమైన చూపులు, మర్మం లేని మాటలు- ఇవన్నీ ఆమెకో మంచి మనసుందని చెప్తాయి.

చాలా రాత్రి వరకు రావుకి నిద్రపట్టలేదు. కలలో ఆ రాత్రి మయూరాక్షే కనిపించింది.

తరువాత మరో రెండు నెలల వరకూ వాళ్ల కలుసుకోలేదు. రాయ్‌బాబు దగ్గరికి వెళ్లాలంటే మయూరాక్షి పక్కనుండే పోవాలి. మయూరాక్షిని చూడాలని వున్నా, రాయ్ బాబుని కలియాలని అనుకున్నా అతను వాయిదా వేస్తూ వచ్చాడు.

అనుకోకుండా ఓ ఆదివారం ఉదయం మళ్లా మయూరాక్షి ఎక్స్‌ప్రెస్‌లో, అదే పాంట్రీ కారులో, అదే టేబులుకి ఎదురుగా వాళ్లిద్దరూ కలుసుకున్నారు.

"రావు బాబూ!" చిన్న పిల్లలా సంబరపడి పలకరించింది మయూరాక్షి.

"హలో మిసెస్ మయూరాక్షి!" అన్నాడు నవ్వుతూ రావు. "నన్ను మయూరాక్షి అనే పిలవండి. మరేం




"దీపావళి సిరులు" చిత్రం: వెల్లటూరు పూర్ణానంద శర్మ

చెర్చకండి" అంది సీరియస్‌గా ఆమె.

రావు బాబు ఆమె ముఖంలోకి చూసి మెల్లిగా అన్నాడు.

"నిజమా మయూరాక్షి?"

"అవును."

ఆ విధంగా రెండోసారి కలుసుకున్నారు. ఆమె అతనితో అట్టేసేపు కూర్చోలేదు. ఎవరో వయసులోని పెద్దాయన వచ్చి ఆమెను పిలుచుకుపోయాడు. సగం తాగుతున్న టీ అలాగే విడిచి ఆమె వెళ్ళిపోయింది. ఆ వచ్చిన మనిషి, అయిదు నిమిషాలు రావు ముఖంలోకి చూసి, తలూపుతూ వెళ్ళిపోయాడు.

రావుకి ఆశాభంగమే కలిగిందని చెప్పొచ్చు. ఆమె గురించి చాల విషయాలు అడిగి తెలుసుకోవాలని, ఆమెతో చాలసేపు మాట్లాడాలని, ఆమెను నవ్వించి అందాన్ని చూడాలని అనుకున్నాడు. అనుకున్నంత సేపు పట్టలేదు. వాడెవడో వచ్చి ఆమెను తీసుకుపోయాడు.

ఆ రాత్రికూడా రోజీని పంపించేశాడు. చాల రాత్రి వరకు మయూరాక్షి గురించే ఆలోచించాడు.

ఈ సంఘటన జరిగి రెండు వారాలైనా కాలేదు. అతను చాల పని ఒత్తిడిలో మయూరాక్షిని మరచిపోయాడు. వరుసగా ఆరు ఎర్తు మూవర్లు పాడయాయి. పని స్తంభించిపోయింది. అందరూ చాల గాభరాపడుతున్నారు.

ఏదో ఆలోచిస్తూ హౌరా స్టేషనులో కంపెనీ కారు వేపు నడిచాడు రావు. కారు తలుపు దగ్గిర మయూరాక్షిని చూసి అతను నిలబడిపోయాడు.

"మయూరాక్షి!"

"రావు బాబు! నేను బర్ద్వాను లోకల్‌లో ఒక్క పది నిమిషాల ముందు దిగాను. ఇవాళ మీరొస్తారని తెలుసు. మీతో కలిసిపోదామని ఇక్కడ నిలబడ్డాను."

ఆమె ముఖంలో ఏదో ఆందోళన. ఇద్దరూ కార్లో కూర్చున్నారు. ఎవరూ మాట్లాడుకోలేదు. ముందు అతని హోటలు సమీపించింది. అతను తలుపు తీసి దిగి, డ్రైవరుతో ఆమెను టాలీ గంజ్‌లో దింపిరమ్మన్నాడు.

"రావు బాబూ! నాతో పాటు మీరు రాలేరా?"

అంత చికాకులోనూ అతను ఆమె మాటను కాదనలేకపోయాడు. టాలీగంజ్‌లో వాళ్ళక్కగారి ఇల్లు మూడో అంతస్తులో వుంది. అక్కడ కారు ఆగగానే ఆమె తొందరగా తలుపు తీసి, చేతితో అతనిని వుండమని చెప్పి మెట్లెక్కి మీదకు పోయింది.

క్షణక్షణం అతను వాచీ చూసుకుంటున్నాడు. చాల పని వుంది. డైరెక్టర్లకు ఆరు మెషీనులు ఒక్కసారే ఎందుకు పాడయాయో చెప్పాలిసివుంది. రోజీని, లక్ష్మిని ఇద్దర్నీ రమ్మన్నాడు. అంతకి పూర్వమే డిక్టేషన్ ఇవ్వాలని, ముందుగా వాళ్ళకు మెసేజ్ పంపించాడు.

అయిదు నిమిషాలలోనే మయూరాక్షి మేడ దిగి కారు దగ్గిరికి వచ్చింది.

"ఏమయింది?" ఆమె ముఖంలోని ఆందోళన చూసి రావు ప్రశ్నించాడు.

"మా అక్కా, పిల్లలు అందరూ పూరీ వెళ్ళిపోయారు. రెండు రోజుల దాకా రారట!" అంది మయూరాక్షి.

"అయితే మరేం చేస్తావు?"

"అదే నాకూ తెలియడంలేదు."

"మళ్ళా స్టేషనులో దిగ బెట్టమన్నావా?"

"వద్దు! ఇక్కడెక్కడో నా స్నేహితురాలితో గడిపి, రేపు ఉదయం వెళ్ళిపోతాను."

రావు ఆలోచిస్తున్నాడు.

"మయూరాక్షి! నువ్వు మరెవరితో భోజనం చేయడం దేనికి! నీకు అభ్యంతరం లేకపోతే నాతో వుండి తీసుకో. నీ కోసం హోటల్‌లో మరో గది బుక్ చేస్తాను. రేపు పొద్దున్నే వెళ్ళిపోదువు గాని."

"అబ్బో ! నేనా హోటల్ గడప తొక్కడానికి కూడా అర్హురాలిని కాను."

రావు ఒక క్షణం ఆమె ముఖంలోకి చూసి అన్నాడు.

"మయూరాక్షి! రావు స్నేహితురాలిగా నీకా అర్హత వుంది."

మయూరాక్షి అతని కళ్ళల్లోకి చూస్తూ, ఎంత ఆపుకుందామన్నా ఆగని దుఃఖాన్ని అణుచుకుంటూ, పైటతో కళ్ళొత్తుకొని అంది. "రావు బాబూ! నీ మాటలు నమ్మొచ్చా?"

"యూ సిల్లీ గర్ల్! ముందుకార్లోకెక్కు!"

"మీరు నా కోసం మరో గది తీసుకోనంటే వస్తాను!"

అంత చికాకులోను అతనికి నవ్వొచ్చింది. ఆ నవ్వును చూసి ఆమె ముఖంలో కొత్త వెలుగొచ్చింది.

ఆ ఆదివారం లక్ష్మిని, రోజీని డబ్బిచ్చి పంపించేశాడు రావు. మయూరాక్షితో మాట్లాడుతూ, మయూరాక్షితో నవ్వుతూ, మయూరాక్షే సర్వస్వంగా ఆ రాత్రంతా గడిపాడు. ఆరు ఎర్తు మూవర్లూ మరచిపోయాడు. రాక్షసుల్లాంటి డైరెక్టర్లిద్దరినీ మరిచిపోయాడు.

అటువంటిది మయూరాక్షి!

మర్నాడు మీటింగులో డైరెక్టర్లతో చాల తేలికగా మాట్లాడాడు. ప్రాబ్లమ్ గురించి చర్చించాడు. కంపెనీ వారిని రెండు మెషీనులు వెంటనే కొనమన్నాడు. మిగిలిన నాలుగు వారం రోజులలో బాగుచేస్తానన్నాడు. తిరిగి వచ్చేసరికి హోటల్ గదిలో మయూరాక్షి లేదు. పొద్దున బజారుకు పోయి చీరలు కొనుక్కొని రమ్మని అయిదు వందల రూపాయలు ఇచ్చాడు. ఆమె మరి తిరిగి రాలేదు. చాల సేపటి వరకు ఆమె కోసం చూశాడు. ఆమెతో అనుభవించిన ఆనందం మరచిపోలేకపోయాడు.

' ఓ వీనస్ ' ఎన్నో సార్లనుకున్నాడు.

తరువాత ఒక నెల వరకు అతను అన్నీ మరచిపోయాడు. మెషీన్లే అతని లోకం-

ఉన్నట్టుండి ఒక సోమవారం ఉదయం హోటల్ గదిలో అతను రిలాక్సవుతుంటే, బేరరు ఒక చీటీ తెచ్చాడు. ఆ మనిషి లోపలికి వచ్చింది.

మయూరాక్షి!

ఆమె కళ్ళల నిండా నీరు. చెంపపైన చారికలు. చెదిరిన జుత్తు-

"హాదో మయూరాక్షి!"

"రావు బాబూ!" ఆమె మళ్ళా ఏడుస్తోంది.

రావు ఆమెను లాలనగా చేతుల్లోకి తీసుకొని, కన్నీళ్ళు కొనగోట చిమ్ముతూ అడిగాడు.

"ఏం కష్టమొచ్చింది మయూరాక్షి?"

"నన్నా రాయ్‌తో పొమ్మంటున్నాడు రావు బాబూ!"

"నువ్వు చెప్పేది ఏమీ అర్థమవడం లేదు."

"అదే అదే నా భర్త... అతనికి ప్రమోషన్ కావాలట. ఆ ప్రమోషను రాయ్ చేతుల్లో వుందట."

"ఉంటే!?"

"ఆ రాయ్‌కి ఆడవాళ్ళంటే తెగని మోజు. అందు కోసం అవుటాఫ్ టర్న్ ప్రమోషన్‌కి మరో దారిలేదని ఆ పెద్దమనిషి నన్ను పంపించాడు."

"అయితే నేను రాయ్‌ని కాదు కదా!... నేను రావుని కదా!"

ఆమె మళ్ళా ఏడ్చింది.

"నువ్వు కూడా అలా అంటావా, రావు బాబూ!"

"మయూరాక్షి! ఇందులో నేనేం చేయగలను?"


"అందరూ అలానే అంటారు. ఈ మగాళ్ళ తీరే అంత. ఆడదానికో మనసుందని, అది బాధపడుతుందని, అది అందరికీ ఇవ్వలేనిది కాదని, ఆ ఇచ్చిన మహారాజుకూడా చేతులెత్తేస్తే ఏం చేయగలదని..."

రావు బాబు ఆమె ముఖంలోకి చూశాడు. చెన్ను తట్టాడు.

# బిజినెస్ సీక్రెట్

ఆదివారం ఆఫీసుకి సెలవు కావటాన ఇంట్లో ఏం తోచక అలా పవర్‌పేటవైపు బయలుదేరి నా మిత్రుడి దుకాణం చేరుకున్నాను. నా మిత్రుడు శేఖరం అక్కడో కిళ్ళీషాపు నడుపుతున్నాడు. అందులో వార, మాస, దినపత్రికలు కూడా దొరుకుతాయి (తెలుగువే అనుకోండి). కిళ్ళీలతోపాటు అన్ని రకాల 'బ్రాండ్'ల సిగరెట్లు సైతం జోరుగా, హుషారుగా అమ్మకం చేస్తాడు మావాడు శేఖరం. శేఖరం, నేను పదో తరగతిదాకా ఒకే స్కూలులో, ఒకే క్లాసులో సహాధ్యాయులం. వాడు పదోక్లాసు రెండుసార్లు తప్పి, ఆపై ఇంక చదివే ఓపిక లేకనో, వాళ్ళ నాన్నకి చదివించే స్తోమత లేకనో అర్జెంటుగా పవర్‌పేటలో కిళ్ళీ కమ్ పుస్తకాల షాపు తెరచేసి 'దిగ్విజయం'గా నడుపుకొస్తున్నాడు.

చదువులో కాస్త వెనుకంజవేసినప్పటికీ, వ్యాపారంలో ఘటికుడనేనని నలుగురిచేత అనిపించుకున్నాడు. మా ఇద్దరి దారులు, వృత్తులు వేరైనా, స్నేహితులం కాబట్టి అప్పుడప్పుడు వాడి షాపుకెళ్ళి అక్కడ పుస్తకాలూ అవీ తిరగేస్తూ, మాట్లాడుతూ, సిగరెట్లు పీలుస్తూ, కిళ్ళీ నముల్తూ శేఖరంతో మాట్లాడి వస్తుంటాను నేను. నేను వెళ్ళేసరికి వాడు బిజీగా వున్నాడు. ఎవరికో గబగబా నాలుగు కిళ్ళీలు కట్టి, మరో మూడు పత్రికలు వేరే వారికిచ్చి, వారిచ్చిన డబ్బు మూసుకుని, ఇవ్వాల్సిన చిల్లర ఇచ్చేసి నన్ను చూసి "రా గురూ ఏమిటిలా వచ్చేశావ్?"



అంటూ కూర్చో అన్నట్టు అక్కడున్న చిన్న బెంచీ చూపెట్టేడు. అక్కడ కూర్చుని, వాడ్ని వ్యాపారం ఎలా వుందని కుశల ప్రశ్న వేసేను.

బ్రహ్మాండంగా వుందన్నాడు. ఇంతలో ఒక వ్యక్తి దుకాణం దగ్గరకొచ్చి, ఒక సిగరెట్టు పెట్టె ఇమ్మని పదినోటు ఇచ్చేడు. ఆ వ్యక్తి హుందాగా, ఖరీదైన దుస్తులతో దర్జాగా వున్నాడు. మావాడు సిగరెట్ పాకెట్ ఇచ్చి, ఐదు రూపాయిలు తిరిగి ఇస్తూ, "రెండ్రూపాయిల చిల్లర తక్కువైంది సార్" అని, "పోనీ రెండ్రూపాయిలకు ఇంకేమైనాతీసుకుంటారా?" అని, "కొత్త పత్రిక వచ్చింది సార్, చాలా బాగుంది" అని చూపించాడు. ఆ వ్యక్తి "సరే ఇవ్వు" అంటూ ఆ రెండ్రూపాయిలకు బదులుగా ఆ పత్రిక పట్టుకుని వెళ్ళిపోయాడు. నేను శేఖరాన్ని అడిగేను "నీ దగ్గర నిజంగా చిల్లర లేదా? ఇంతమంది వచ్చిపోతున్నారు కదా? సేల్స్ బాగా వుంటాయి కదా?" అని. శేఖరం "మనిషిని బట్టి వ్యాపారం చేస్తే బాగా సంపాదించొచ్చు."

"ఇప్పుడొచ్చిన అతను మంచి శ్రీమంతుడు. మంచి ఖర్చుదారుడు. తనకి సిగరెట్ పెట్టె అవసరం. కాని, అదిచ్చి చిల్లర లేదంటే, ఆ తక్కువైన చిల్లర బదులు పత్రిక తీసుకోండి అనగానే తీసుకున్నాడు. నిజానికి నా దగ్గర చిల్లరున్నా ఆ పత్రిక కొనిపించడం కోసం చిల్లర లేదన్నాను. అతనా పత్రిక కొనడంవల్ల నాకు క్షణంలో యాభై పైసల కమిషన్ లాభంగా వచ్చింది. ఇలా అబద్ధం ఆడడంవల్ల అతనికి నష్టం ఏం లేదు నా వల్ల.

"ఆయనకి కొనే స్తోమత వుంది కదా అని వెంటనే కొన్నాడు. భుక్తికోసం వ్యాపారరీత్యా అలా చిన్న చిన్న చిట్కాలు చేయడం మాకు మామూలే. అందువల్ల ఎవరికీ నష్టంలేదు. ఇదే పేదవాడైతే రెండ్రూపాయిలు పెట్టి అంత వెనక ముందూ చూడకుండా కొనడు కాబట్టి, తప్పని సరిగా సిగరెట్ పాకెట్ ఇచ్చి, చిల్లర కూడా మిగతాది వాపసు ఇచ్చి వుంటాను. ఇంకేదైనా కొనమన్నా ఆ వ్యక్తి కొనలేడు కాబట్టి" అన్నాడు. మొత్తానికి శేఖరం ఘటికుడే!

చదువులో కాకపోయినా, జీవితంలో మంచి హుషారు, తెలివి ప్రదర్శిస్తున్నాడని నాకు అన్పించి మనసులోనే మెచ్చుకున్నా వాడ్ని. వాడు చేసేది వ్యాపారమే ఐనా, ఒకరిని మోసం చేయకుండా, మనిషి స్తోమతని, స్వభావాన్ని అంచనాకట్టి తనకి లాభం కలిగినా, ఎదుటి మనిషిని దోచకుండా తెలివిగా, సమంజసంగా సమయస్ఫూర్తిని చూపెట్టి నొప్పించక తానొవ్వక అనే రీతిలో చేస్తున్నాడనుకుని "మంచి వ్యాపారవేత్తవేనోయ్" అని కితాబిచ్చేను.

—ఎస్. వెంకటరవీంద్ర

---

"మయూరాక్షి? నేను నీకు సహాయం చేస్తాను. విషయం సమగ్రంగా చెప్పు..."

"చెప్పడానికేముంది. నా భర్తకు ప్రమోషన్ కావాలి. అతను స్టోరు ఇష్యూవరుగా వున్నాడు. గుమస్తా ఉద్యోగం ఒకటి ఖాళీ అయింది. దానికి సీనియారిటీలో ఇతను ఆరోవాడు. ఇతని టర్నుకి మరో రెండు సంవత్సరాలు పడుతుంది."

"అందుకోసమని పెళ్ళాన్ని రాయ్ దగ్గిరికి పొమ్మన్నాడా?"

"అవును, రావు బాబూ!"

"ఇది చాలా అన్యాయం. నీ భర్త ఇంత దౌర్భాగ్యుడని నేననుకోలేదు."

"చాల మంది పెద్ద మనుషులే ఇలాంటి పనులు చేశారు."

"మయూరాక్షీ! దాగుడుమూతలు ఎందుకు? విషయం చెప్పు."

"వినే తీరిక నీకుందా?"

"మయూరాక్షి ఏది చెప్పినా వింటాను."

"నేను బోల్‌పూర్ శాంతినికేతనంలో ఎమ్మే పాసయ్యాను. అంత తెలివి తేటలు లేకపోతే ఒక ప్రొఫెసరు గారింటికి పాల కోసం వెళ్ళేదాన్ని. ఆయన చాలమంచి వాడే! సందేహంలేదు. కాని అతనికో బావమరిది వుండేవాడు చాల తెలివైన వాడు. నాకు సెకెండు క్లాసు ఇప్పిస్తానని మోసం చేశాడు. అది వాడి వృత్తి. మరేం చేయను."

"డామిట్"

"తరువాత ఉద్యోగమిప్పిస్తానని మరోడు డబ్బు తిన్నాడు. నన్నూ విడిచి పెట్టలేదు."

"వెధవ!"

"తరువాత- నా తల్లి దండ్రులు -వాళ్ళేం చేస్తారు! బీదవాళ్ళు- వాళ్ళు నా జీతం రాళ్ళతోనే సంతోషించారు. ఎంతమందో పెళ్ళి చేసుకోవాలని వచ్చినా, వెనక్కు పెట్టారు- నాతోపాటు వాళ్ళ బ్రతుకు చెడుతుందని"

"మరీ దౌర్భాగ్యుడెలా జతపడ్డాడు?"

"నేను తెచ్చే జీతంలో సగానికి ఒప్పుకున్నాడు. అట్టే డబ్బు కూడా కట్నం పుచ్చుకోలేదు."

"అయితే కొంతలో కొంతమంచివాడే"

"ఏం మంచి! అతనికి నన్నెట్లా వినియోగించుకోడమో తెలుసు."

"అంటే?"

"ఆ రోజు నన్ను తనే నీ దగ్గిరికి పంపించాడు. ఉద్యోగం చిన్నదైనా వ్యసనాలకు లోటుండదు కదా! నువ్విచ్చిన డబ్బులు నెల్లాళ్ళు తాగాడు."

"రాస్కెల్!"

"రావ్ బాబూ! ఇప్పుడీరాయ్ దగ్గిరికి పోయి ప్రమోషను తెమ్మంటున్నాడు."

"ఓ మయూరాక్షీ! నువ్వీ పనిచేయడానికి వీల్లేదు."

"మరేం చెయ్యడం?"

"ఏం చెయ్యడమో నాకు తెలుసు. వాడిని కొనేస్తాను. డబ్బే వాడికి కావాలి. మిగిలిన దంతా మోసం. నీ భర్తకు వారంరోజుల్లో ప్రమోషను తెప్పిస్తున్నానని చెప్పు."

"నిజమా, రావు బాబూ!"

ఆమె ఏడ్చింది. ఆ ఏడుపునుంచి తేరుకొంది. తరువాత నవ్వింది. తరువాత ఒంటికి కట్టిన పుట్టాలు విప్పుకొంది.

"ఇదెందుకు?"

"నీ దగ్గిర నాకు బిడియం లేదు"

రావు బాబు ఆమెను చేతుల్లోకి తీసుకొని అన్నాడు.

"బట్టలు వేసుకో! నువ్వు నాకు హృదయ మిచ్చావు. ఈ శరీరం దేనికి! నువ్వు నా ప్రాణానివి. నా దేవతవి మయూరాక్షీ!"